

ఎన్నికల నిర్వహణ అబ్జర్వర్‌కు పూలబొకే అందజేస్తున్న కలెక్టర్

జిల్లాకు చేరుకున్న ఎన్నికల అబ్జర్వర్

ఖిల్లా, ఏప్రిల్ 24: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రానికి చేరుకున్న నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎలిసవజ్‌ఆర్‌ను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగేనేవార్ రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో కలిసి పూలబొకే అందించి స్వాగతం పలికారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిర్వహణకు కొనసాగుతున్న ఏర్పాట్ల గురించి అబ్జర్వర్‌కు కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల గురించి తెలియజేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక కమిషనర్ మకరంద్, జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు, సూచనలకు సంప్రదించవచ్చు : కలెక్టర్

పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సాధారణ పరిశీలకులుగా ఎలిసవజ్‌ఆర్ (2005) బ్యాచ్ ఐఏఎస్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సంబంధిత అంశాలపై జనరల్ అబ్జర్వర్ సెల్ నంబరు 8985340522 ద్వారా సంప్రదించవచ్చన్నారు. నిజామాబాద్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి 11గంటల మధ్యన నేరుగా కలిసి ఫిర్యాదులు, సూచనలు అందజేయవచ్చని సూచించారు. అదేవిధంగా, వ్యయ పరిశీలకులుగా డీఎం నెమ్మీ ఐ.ఆర్.ఎస్(2015బ్యాచ్) వ్యవహరిస్తున్నారని, సెల్ నంబరు 8985341588 ద్వారా అబ్జర్వర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. వ్యయ పరిశీలకులను ప్రతిరోజూ సాయంత్రం 4గంటల నుంచి 5గంటల మధ్యన నేరుగా కూడా కలిసి ఫిర్యాదులు, సూచనలు అందచేయవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు అబ్జర్వర్లు పార్లమెంటు నియోజకవర్గంలో అందుబాటులో ఉండి ఎన్నికలకు సంబంధిత అంశాలను పరిశీలిస్తారన్నారు. సెలవుదినాల్లో మినహాయించి మిగతా అన్ని రోజుల్లో నిర్దీత సమయాల్లో పరిశీలకులను సంప్రదించవచ్చన్నారు.

ఇంటర్ ఫలితాల్లో.. Results
బాలికలదే హవా..



- ఇంటర్‌లో 60శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లా విద్యార్థులు
- ఫస్టియర్‌లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 28వ ర్యాంకు, సెకండియర్‌లో 29వ ర్యాంకు
- ధర్మారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి మార్కులు
- ఉషోదయ, ఎస్ఆర్, నారాయణ, వెక్టర్ విద్యార్థుల హవా



కె.అంకిత (ఉషోదయ)
ఎంపీసీ 993/1000



కె.సౌమ్య (ఎస్ఆర్)
ఎంపీసీ 990/1000



కీర్తన (నారాయణ)
ఎంపీసీ 991/1000



మేఘన (గురుకుల కళాశాల)
ఎంపీసీ 468/470

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మరోసారి బాలికలే పైచేయి సాధించారు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎప్పటిలాగే బాలికలు టాప్ లేపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 14,974 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 7,479 మంది విద్యార్థులు 49.95శాతం ఉత్తీర్ణతతో సాధించారు. దీంతో జిల్లా రాష్ట్రస్థాయిలో 28వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 59.59 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 13,988 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 8,335 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతంలో జిల్లా రాష్ట్రస్థాయిలో 29వ స్థానంలో నిలిచింది.

ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం 2,400 మంది విద్యార్థులు హాజరుకాగా 43.17శాతం ఉత్తీర్ణతతో 1,036 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ రెగ్యులర్‌లో 1,999 మంది పరీక్షలకు హాజరుకాగా 1,049 మంది ఉత్తీర్ణులయ్యారు. జనరల్ ద్వితీయ సంవత్సరం ప్రైవేట్ ఫలితాల్లో 1,807 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 25.95 శాతం ఉత్తీర్ణతతో 469 మంది పాస్ అయ్యారు. ఒకేషనల్ ప్రైవేట్ సెకండర్ ఇయర్ ఫలితాల్లో 193 మంది విద్యార్థులకుగాను 73 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 8,076 మంది బాలికలు పరీక్షలు రాయగా 60.57 శాతం ఉత్తీర్ణతతో 4,892 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లోను మొత్తం 7,671 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 67.57శాతం ఉత్తీర్ణతతో 5,183 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 6,898 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 37.5శాతం ఉత్తీర్ణతతో 2,587 మంది పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 6,317 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 49.9 శాతం ఉత్తీర్ణతతో 3,152 మంది పాస్ అయ్యారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బోధన్ ఉషోదయ కళాశాలకు చెందిన విద్యార్థులు కె.అంకిత ఎంపీసీలో 993/1000 మార్కులు సాధించగా అదే కళాశాలకు చెందిన జె.పూజ బైపీసీలో 990/1000, ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో సి.పూజిత ఎంపీసీలో 467/470, ధర్మారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో మేఘన 468/470, లక్కి 468/470, రిషిక 467/470, బి.ఆశ్రిత 466/470 మార్కులు సాధించారు. నగరంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన కె.సౌమ్య ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 990/1000, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బైరి శ్రీనిధి ఎంపీసీలో 468/470, బైపీసీలో రాథోడ్ స్నేహ 438/440 మార్కులు సాధించారు. నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు కీర్తన ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 991/1000, నారా మాధవి నాగశ్రావ్య ఎంపీసీ ఫస్టియర్‌లో 467/470 మార్కులు సాధించారు. నగరంలోని వెక్టర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్.సంస్కృతి ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 466/470 మార్కులు సాధించారు.

ఐదేళ్లలో జిల్లా ఉత్తీర్ణత శాతం ఇలా..		
సంవత్సరం	ఫస్ట్ ఇయర్	సెకండర్ ఇయర్
2018-19	57%	67%
2019-20	49%	60%
2020-21	100%	100% (కరోనావల్ల)
2021-22	58%	65%
2022-23	51%	60%
2023-24	49.95%	59.59%

తగ్గిన ఉత్తీర్ణత శాతం..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో గత ఏడాదితో పోలిస్తే ఈ యేడాది ఉత్తీర్ణత శాతం తగ్గింది. గత యేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం 51శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సంవత్సరం 49.95శాతం సాధించింది. సెకండ్ ఇయర్ ఫలితాల్లో గత విద్యాసంవత్సరం 60శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సంవత్సరం 59.59 శాతానికి పడిపోయింది. ఈ విద్యాసంవత్సరం మాత్రం జిల్లా ఉత్తీర్ణత శాతంలో ఇతర జిల్లాలతో పోలిస్తే వెనకబడింది.



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



నామినేషన్లకు నేడు చివరి రోజు

- ఇప్పటి వరకు 33 మంది అభ్యర్థుల నామినేషన్లు
- నేడు మరోసెట్ నామినేషన్ వేయనున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల అంకం తుది దశకు చేరుకుంది. నాల్గవ దశ పోలింగ్ జరుగుతున్న రాష్ట్రంలో ఈనెల 18న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. గురువారంతో నామినేషన్ల గడువు ముగియనుంది. ఇప్పటి వరకు మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, ధర్మసమాజ్ పార్టీ, దళిత బహుజన పార్టీ, బహుజన లెఫ్ట్ పార్టీ, ఆలిండియా బీసీ ఓబీసీ, ప్రజాసేన పార్టీ, ఆలిండియా నేషనల్ పార్టీ, తదితర పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మరికొంతమంది నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బాజిరెడ్డి గోవర్ధన్, తాటిపర్తి జీవన్‌రెడ్డిలు ఇప్పటికే కొన్ని సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో మరికొంత మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గురువారం మరోసెట్ నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఇప్పటి వరకు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి 33 మంది అభ్యర్థులు 62 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు.

బుధవారం 18 నామినేషన్ల దాఖలు

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా బుధవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ నాల్గవ సెట్, బీజేపీ అభ్యర్థిగా అర్వింద్ ధర్మపురి మూడో సెట్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా టి.జీవన్‌రెడ్డి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా ఆరె రాజేందర్ మూడవ సెట్, జి.సాయికృష్ణమూర్తి యుగతులసి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొండూరు గంగాధర్, పోతు నవీన్, దేశబోయిన లక్ష్మీనారాయణ, చెంచుల అశోక్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా మొగిలి రాజ్‌కుమార్, పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా పానుగంటి రజితవాణి, ప్రజాసేన పార్టీ అభ్యర్థిగా నాగార్జున ఒక సెట్ చొప్పున, స్వతంత్ర అభ్యర్థిగా ముత్యం రఘు రెండు సెట్ల నామినేషన్లు, ఆల్ ఇండియా నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఎండీ షాహిద్‌ఖాన్ రెండవ సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.

ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల గురువారం నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావాలని ఆయన అన్నారు. ఉన్నతాధికారులతో కలిసి ఆయన బుధవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష జరిపారు. తుది ఓటరు జాబితా రూపకల్పన, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, పోలింగ్ కేంద్రాలలో సదుపాయాల కల్పన, ఓటరు స్లిప్పుల పంపిణీ, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టవల్సిన అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ నెల 25న తుది ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన మీదట ఈనెల 29న పోటీలో ఉన్న గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు తుది ఓటరు జాబితాను అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలను అందజేయాలని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు సందర్శించి తగిన ఏర్పాట్లు ఉన్నాయోలేదో చూడాలన్నారు. నామినేషన్ల దాఖలుకు గురువారం చివరిరోజు అయినందున ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉన్నందున దాన్ని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి గందరగోళం తప్పిదాలు లేకుండా చూడాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు, గుర్తులతో కూడిన పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ చేయించాలన్నారు. ఈ వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

నేడు ఉత్తరాఖండ్ సీఎం రాక

- అర్వింద్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం
- పాత కలెక్టరేట్ మైదానంలో బహిరంగ సభ
- భారీగా జనసమీకరణకు బీజేపీ శ్రేణుల ఏర్పాట్లు



పుష్కర్‌సింగ్ ధామి,
ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి జిల్లా కేంద్రానికి రానున్నారు. నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్‌కులాచారి తెలిపారు. ఇప్పటికే ఎంపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ నామినేషన్ దాఖలు చేసినప్పటికీ గురువారం మరోసారి భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. బహిరంగ సభకు సంబంధించి పాత కలెక్టరేట్ మైదానంలో నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. భారీగా జనసమీకరణ చేసి సభను జయప్రదం చేసేందుకు బీజేపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, జగిత్యాల, కొరుట్ల నియోజకవర్గాల నుంచి పార్టీ నేతలను బహిరంగ సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మోస్రాలో కుస్తీపోటీల దృశ్యం

మోస్రాలో కుస్తీపోటీలు

మోస్రా, ఏప్రిల్ 24: మండల కేంద్రంలోని రామాలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న మల్లయోధులకు నగదు రూపంలో బహుమతులు అందజేశారు. మహారాష్ట్ర, కర్నాటక నుంచి మల్లయోధులు తరలివచ్చారు. చివరిగా గెలుపొందిన మల్లయోధునికి నాలుగు తులాల వెండి బహూకరించారు. నాసిక్‌కు చెందిన జరసంద్‌కు నాలుగు తులాల వెండి బహూకరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు సురేసాయిలు, గ్రామ పెద్దలు బిల్లా పోతారెడ్డి, మల్లయోధులు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



నవీపేటలో బైక్ నడుపుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నవీపేట, ఏప్రిల్ 24: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం సాయంత్రం నవీపేటలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరానికి మించి కొనసాగే అవకాశం లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీతో కుమ్మక్కై మరో తెలంగాణ షిండేగా తయారు కావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీగా పని చేస్తున్న ధర్మపురి అరవింద్ గతంలో జిల్లాలో మూతబడ్డ చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని చెప్పడంతో పాటు పసుపు బోర్డును తెస్తామని హామీ ఇచ్చి వాటిని విస్మరించారని ఆయన విమర్శించారు. తాను ఎంపీగా గెలిచిన తర్వాత నవీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నవీపేటలో అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అంతకు ముందు బస్టాండ్ నుండి ప్రధాన చౌరస్తా వరకు జరిగిన బైక్ ర్యాలీలో బాజిరెడ్డి గోవర్ధన్ బైక్ నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, బోధన్ మాజీ ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా, గిర్దావర్ గంగారెడ్డి, నర్సింగ రావు, అబ్బన్న, ప్రవీణ్ కుమార్, తెడ్డు పోశెట్టి, భవంతి దేవిదాస్, సూరిబాబు, హరీష్ కుమార్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతా..

ఎడపల్లి: ప్రజలకు మాట ఇస్తే తప్పని వ్యక్తిని, మీకు మాటిస్తున్నా మీ సమస్యల పరిష్కారానికి పోరాడతానని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల ఎదుగుదలను ఓర్వలేని మనిషిని మీరు ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. బోధన్ మాజీ ఎమ్మెల్యేను, ఎమ్మెల్సీ కవితను ప్రచారం చేయకుండా చేస్తే ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేయరని బీజేపీ, కాంగ్రెస్‌లు భ్రమ పడుతున్నాయని అన్నారు.

నాలుగు నెలలు గడుస్తున్నా.. కాంగ్రెస్ చేసిందేమీ లేదు

రెంజల్: 65ఏళ్ల కాంగ్రెస్ పాలనను అణచివేసి ప్రత్యేక తెలంగాణను సాధించి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అనతికాలంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా చేసిందేమి లేదని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో రోడ్ షో నిర్వహించి మాట్లాడారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించలేని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గానికి చేసిందేమి లేదని బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు.

వేంపల్లిలో ఘనంగా మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన

● పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్

ముప్కాల్, ఏప్రిల్ 24: ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ప్రతిష్ఠాపన మహోత్సవానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొనగా.. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయంలో ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపనకు అర్చకులు వేదమంత్రాలతో నవగ్రహ పూజ, కలశపూజ, యజ్ఞం, పుణ్యాహవచనం వంటి పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన గావించగా మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మల్లన్నస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాదిగల అభివృద్ధికి ఏనాడూ సహకరించలేదు : భూమన్న

సిరికొండ, ఏప్రిల్ 24: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ప్రకటించిన మాదిగ నాయకుడు మందకృష్ణ మాదిగ మాదిగల అభివృద్ధికి ఏనాడూ సహకరించలేదని మాదిగ కుల సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో భూమన్న మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పని చేసిన ఎమ్మార్పీఎస్ నాయకుల అభివృద్ధికి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా ఏనాడూ సహకరించి ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముప్పై ఏళ్ల ఉద్యమంలో మాదిగ జాతీ కోసం పని చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు అన్ని రాజకీయ పార్టీల నుంచి ఎంపీ టికెట్లను ఇప్పించడానికి మంద కృష్ణ మాదిగ ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. అలాగే ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి పోరాటాాల వల్లనే మందకృష్ణ మాదిగ దేశస్థాయి ఉద్యమ నేతగా ఎదిగారని ఆయన గుర్తు చేశారు. మాదిగ జాతి కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఆర్థికంగా ఆదుకోలేక పోయారని, రాజకీయంగా ఎదగడానికి కూడా సహకరించని మందకృష్ణ మాదిగా.. ఉద్యమాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని భూమన్న ఆరోపించారు. బీజేపీలో మాదిగ ఉద్యమ నేతలకు ఎవరికీ ఎందుకు టికెట్లు ఇప్పించలేదో? స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేయాలంటే ఆర్డినెన్స్ ద్వారా తీసుకురావచ్చని, లేదంటే సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరఫున రిజర్వేషన్లకు అనుకూలంగా విధించకుండా కమిటీనీ ఎందుకు వేసిందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అత్యధికంగా మాదిగ ఓటర్లున్న నాగర్‌కర్నూల్‌లో ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పనిచేసే నాయకుడికి బీజేపీ నుంచి టికెట్ ఇప్పిచండంలో మంద కృష్ణమాదిగ ఎందుకు చొరవ చూపించలేదన్నారు. అంతేకాకుండా మహాజన సోషలిస్టు పార్టీ పెట్టి.. దీని మాదిగ నాయకులకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చి ఎందుకు పోటీ చేయించలేదని ఆయన ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండా కమీటీ పేరుతో కాలయాపన చేసే బీజేపీని మాదిగలెవరు నమ్మరని, బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి ఇచ్చిన రాజ్యంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్న ఆ పార్టీకి రానున్న ఎన్నికల్లో మాదిగలు వ్యతిరేకంగా ఓటు వేసి ఓడించడం ఖాయమని, మందకృష్ణ మాదిగ మాటలు నమ్మవద్దని స్పష్టం అన్నారు.

క్రీడా అసోసియేషన్‌లో రాజకీయ జోక్యం!

» జిల్లాలో రెండుగా చీలుతున్న అసోసియేషన్ » అసోసియేషన్ చీలికతో క్రీడాకారులకు నష్టం » జిల్లాలో అసోసియేషన్‌లకు మండల కమిటీలు నిల్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 24: జిల్లాలో క్రీడా అసోసియేషన్‌లో రాజకీయ జోక్యం ఎక్కువవుతోంది. క్రీడా అసోసియేషన్‌లు క్రీడల అభివృద్ధి కోసం కాకుండా రాజకీయాలలో పలుకుబడి కోసం అసోసియేషన్‌లో పదవులు దక్కించుకుంటున్నారు. జిల్లాలోని ప్రధాన అసోసియేషన్‌లన్నీ రాజకీయ నాయకులతో నిండిపోయాయి. ప్రధాన అసోసియేషన్‌లకు రాజకీయ నాయకులు అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాజకీయ నాయకులు ధన రూపకంగా అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతారని అసోసియేషన్‌లో ప్రాధాన్యం ఇస్తే క్రీడాకారులకు న్యాయం మాత్రం జరగడం లేదు. గత కొన్ని ఏళ్లుగా కొన్ని క్రీడా అసోసియేషన్‌లు క్రీడల అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి. పేరుకు మాత్రం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులమంటూ చెప్పుకుంటూ డాబుకు పోతున్నారు. కానీ క్రీడల అభివృద్ధికి మాత్రం ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదు. జిల్లాలో దాదాపుగా ఎక్కువ అసోసియేషన్‌లకు జిల్లాలో పేరొందిన రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు అధ్యక్షులుగా ఉన్నారు. క్రీడలను నిర్వహించడం భారంగా మారడంతో డబ్బులు ఉన్న రాజకీయ నాయకులను, ఉద్యోగ సంఘ నేతలను అధ్యక్షులుగా పెట్టుకున్నారు. గత కొన్ని రోజులు క్రీడాభివృద్ధికి సహకరించడం లేదని పలువురు క్రీడాసంఘాల నేతలు వాపోతున్నారు. క్రీడల అభివృద్ధికి పాటుపడతారని తెచ్చిపెట్టుకున్న



క్రీడా అసోసియేషన్‌లకు మండల కమిటీలు నిల్

వారికి సహాయం మాత్రం అందడం లేదు. మరి కొందరు క్రీడల అసోసియేషన్‌లో రాజకీయ నాయకులకు ఏం పని అని బహిరంగానే విమర్శిస్తున్నారు. క్రీడా సంఘాల్లో రాజకీయ నాయకుల జోక్యం తగదని క్రీడా సంఘాలు క్రీడాకారులతోనే ఉండాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

● రెండుగా చీలుతున్న అసోసియేషన్

జిల్లాలో క్రీడా అసోసియేషన్ రెండుగా చీలిపోయాయి. రాష్ట్ర నాయకత్వం రెండుగా చీలడంతో జిల్లాలో సైతం రెండు అసోసియేషన్‌లు ఏర్పడ్డాయి. దీంతో క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో హ్యాండ్‌బాల్‌తో పాటు కొన్ని అసోసియేషన్‌లు జిల్లాలో రెండుగా చీలడంతో క్రీడాకారులు ఏ అసోసియేషన్ వైపు ప్రాతినిధ్యం వహించాలో అర్థం కావడం లేదు. కొన్నిసార్లు ఒక అసోసియేషన్ తరపున జిల్లాస్థాయిలో ఆడిన రాష్ట్రస్థాయిలో ఆ అసోసియేషన్‌కు గుర్తింపు లేకపోవడంతో క్రీడాకారులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా జిల్లాలోని కొన్ని అసోసియేషన్‌లు రెండుగా చీలిన అనంతరం వేరువేరుగా ఎంపికలు నిర్వహించడంతో క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర నాయకుల లొల్లితో జిల్లాలో రెండు అసోసియేషన్‌లుగా చీలాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే కొన్ని అసోసియేషన్‌లో రెండుగా చీలి కోర్టు మెట్లు ఎక్కాయి. రాష్ట్ర

జిల్లాలో కొన్ని క్రీడా అసోసియేషన్‌లకు మండల కమిటీలు లేవు. నేరుగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకొని అసోసియేషన్‌లను నడుపుతున్నారు. మండల కమిటీ ద్వారా జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా నేరుగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకొని అసోసియేషన్ అని నడుపుతున్నారు. జిల్లాలో సుమారు 29 మండలాలు ఉండగా, కొన్నింటికి మాత్రం మండల కమిటీలు ఉన్నాయి. క్రీడా సంఘాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా సంవత్సరాల తరబడి ఉన్న నాయకులే ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. కొందరు సీనియర్ క్రీడాకారులు ఉన్న వారికి క్రీడా అసోసియేషన్‌లో స్థానం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా అసోసియేషన్‌లు కురువృద్ధులతో నిండిపోయాయి. కనీసం కొత్తవారికి అవకాశం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అసోసియేషన్‌లు కొత్తవారికి అవకాశం ఇవ్వాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

అసోసియేషన్‌లో ఏం జరుగుతున్నా జిల్లాలో మాత్రం క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతున్నారు.



సుంకెట్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

హామీలు నెరవేర్చని కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధిచెప్పాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెండోర, ఏప్రిల్ 24: హామీలను నెరవేర్చకుండా ఓట్లు అడుగుతున్న కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో సావెల్ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని హామీఇచ్చారని, ఇప్పటికీ మహిళలకు ఉచితబస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కహామీనీ నెరవేర్చలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు ఆగస్టు 15న రుణమాఫీ చేస్తారని దేవుళ్ల మీద ఒట్టు పెట్టడం కొత్త నటకానికి తెరలేపారని అన్నారు. రాముడు పేరుతో, పసుపుబోర్డు పేరుతో రైతులను మోసం చేసిన వ్యక్తి నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులకు బుద్ధి చెప్పి ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తలారి గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, మచ్చర్ల రాజారెడ్డి, కమలాకర్, మోహన్, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుంకెట్, దొన్‌పాల్‌లో..

మోర్తాడ్: మండలంలోని సుంకెట్, దొన్‌పాల్ గ్రామాల్లో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం హోటల్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ ముచ్చటించారు. అనంతరం దొన్‌పాల్‌లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏలియా, బీఆర్ఎస్ నాయకులు తీగెల ప్రదీప్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్, ఏప్రిల్24: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో 19వ అఖండ శివనామ సప్తాహ బుధవారంతో 4వ రోజుకు చేరింది. ఉదయం నుండి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, మండపంలో శివ పారాయణం, వీరశైవ పవిత్ర గ్రంధం, పరమ రహస్య పారాయణ పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ 108 బస్వలింగ శివాచార్య స్వామిజీ కౌలాస్ పీఠాధిపతులు శివనామ సప్తాహ గురించి భక్తులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజు శివనామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందని, దేశ సంస్కృతిని ప్రతి ఒక్కరు ఆచరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు పురాణే అజయ్ కుమార్, శంకరప్ప, యాదవ రావు పటేల్, విఠలప్ప, ప్రభు అప్ప, శివ, దిలీప్ కుమార్, రాజు, శివకుమార్, గణపతిఅప్ప, తదితరులున్నారు.

మే డేను జయప్రదం చేయాలి



మే డే వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోటగిరి, ఏప్రిల్ 24: కార్మికుల హక్కుల కోసం మే డేను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ కోరారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం 138వ మేడే దినోత్సవాలను పురస్కరించుకుని వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్మికులను రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గంగాధర్, భరత్, రాజు, గంగారాం, హన్మాండ్లు, సాయిలు, వసీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్24: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ నందవార్ జితేంద్ర రామచంద్ర అన్నారు. బుధవారం బోధన్ పట్టణ శివారులోని మినార్‌పల్లి చౌరస్తా వద్ద శ్రీకాకతీయ చేయూత చారిట్రబుల్ ట్రస్టులో ఉన్న విద్యార్థులచే కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాలలో రాణించాలని, చదువు యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. నేటి తరం విద్యార్థులు రాబోయే తరంకు ఆదర్శం కావాలన్నారు. కాకతీయ చారిటబుల్ ట్రస్టు సేవలను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌లు రమేష్‌కుమార్ రాయ్, రవీంద్ర రోషన్, రాంభూషణ్ మిశ్రా, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి'



బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో తొర్లికొండ, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల బీఆర్ఎస్ బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీజీ గౌడ్ సమక్షం బ్రాహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల యువకులు బీఆర్ఎస్‌లో చేరగా బీఆర్ఎస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో వీజీ.గౌడ్ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం పనితీరు అమలుచేయని హామీలపై ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలేదని ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం కష్టపడి సైనికుల్లా పని చేయాలన్నారు. కారుగుర్తుకు ఓట్లు వేసి బీఆర్ఎస్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, ధర్పల్లి, జక్రాన్‌పల్లి జడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, తనుజా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు పద్మరాజు, బ్రాహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ అన్వేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిపించాలి

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం మాజీఎమ్మెల్యే జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్లెం మోహన్, మాజీ సొసైటీ చైర్మన్ నలిమెల మోహన్‌రెడ్డి, మోతె చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

● అత్యుత్తమ మార్కులతో మెరిసిన విద్యార్థులు ● విద్యార్థులను అభినందించిన అధ్యాపకులు, గ్రామస్థులు

భీమ్‌గల్‌రూరల్, ఏప్రిల్24: ఇంటర్ ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు, గురుకుల, ఆదర్శ, మోడల్ కళాశాలల్లో విద్యార్థులు సత్తాచాటారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఇంటర్ సెకండ్‌ఇయర్ ఎంపీసీ విద్యార్థిని తుమ్మ సుప్రిక 955, కావ్య 938, బైపీసీ విభాగంలో శ్రీపాద వైష్ణవి 935, సారా మహీన్ 926, జాహనాజ్ 911 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్‌చిరంజీవి తెలిపారు.

రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ధర్మారం గురుకుల విద్యార్థుల

డిచ్‌పల్లి: ధర్మారం(బీ) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటిసంవత్సరం ఎంపీసీలో మేఘన, లక్కీ ఇద్దరు విద్యార్థినులు 470 మార్కులకు 468 మార్కులు సాధించి రికార్డు సృష్టించారని ఆమె తెలిపారు. రిషిక (467), అశ్విత(466), మార్కులు సాధించారు. బైపీసీలో వైష్ణవి 440మార్కులకు 438 సాధించగా, జోయ్‌సీకీర్తన, నైనిక436 మార్కులు పొందగా, రెండో సంవత్సర ఇంటర్మీడియేట్‌ఫలితాల్లో బైపీసీలో స్రవంతి 987 మార్కులు సాధించగా, దేవి 985 సాధించిందన్నారు. ఎంపీసీ విభాగంలో వర్షజయశ్రీ అభినయ 979 సాధించగా సంధ్య అస్మిత 977తో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ముప్కాల్: బాల్కొండ మండలంలోని ఇంటర్మీడియేట్ ఫలితాలలో బాలికలదే పైచేయి నిలిచింది. బాల్కొండ తెలంగాణ రెసిడెన్షియల్ మైనారిటీకళాశాలలో ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో వైనిత్ 966, జి.మైథిలి 926, ఎంపీసీలో బి.సంజన 957, ఎ.నవనీత 954 మార్కులు సాధించగా మొదటి సంవత్సరంలో బైపీసీలో 435, అభిశ్రుతి 434, ఎంపీసీలో స్నేహజ 431, హరిణి 430 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్‌లో 93 శాతం, మొదటి సంవత్సరంలో 85శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు.

బాల్కొండ ఆదర్శ కళాశాలలో..

బాల్కొండ ఆదర్శ కళాశాలలో సాధించిన ఫలితాల్లో మొదటిసంవత్సరంలో ఎంపీసీలో శ్రీవర్ష 450, జె.వైష్ణవి 447, బైపీసీలో ఎన్ అనిల్ 393, శ్రావణి 384, సెకండ్ ఇయర్ ఎంపీసీలో బి.అభిజ్ఞ 952, కె.వెన్నెల 936, బైపీసీలో జి.వెన్ను 902, సీఈసీలో జి.సాయి హర్షిణి 904, పి.శరణ్య 828, ఎంఈసీలో జె.చందన 721మార్కులు సాధించారు.

నవీపేట: నవీపేట మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 33 శాతం విద్యార్థినులు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో శ్రీలక్ష్మి (866/1000) మార్కులు సాధించగా బైపీసీ విభాగంలో సానియా మిర్జా (901/1000)మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 30శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో పీ.భూసారిక(460/470) మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మోకన్‌పల్లి కేజీబీవీలో..

మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీలోని ఎంహెచ్‌డబ్ల్యూ మొదటిసంవత్సరంలో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రత్యేకాధికారిణి రాణి తెలిపారు.

సత్తా చాటిన ధర్పల్లి విద్యార్థులు

ధర్పల్లి: ఇంటర్ ఫలితాల్లో ధర్పల్లి విద్యార్థులు సత్తాచాటారు. మండలకేంద్రానికి చెందిన వార్షికరెడ్డి ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 467/470 మార్కులు సాధించింది. మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలకు చెందిన రాజశ్రీ ద్వితీయ సంవత్సరంలో 980/1000 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం బైపీసీలో అదే పాఠశాలకు చెందిన సంజన బైపీసీలో 435/445 మార్కులు సాధించింది. ఎంపీసీలో ఆర్తి మొదటి సంవత్సరంలో 460/470 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించడంపై ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్‌సాహెబ్ అభినందించారు.

పెర్కిట్: మోడల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంపీసీలో 470మార్కులకు ఆర్.చందన 460, ఎం.వైష్ణవి 453, లేఖశ్రీ 450, డి.వైష్ణవి 447, కావ్య 446, మాదవ్ 446, శ్రీవర్ధన్ 436, బైపీసీలో జి.సాహితి 413, సీఈసీలో ఎం.సౌమ్య 468మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో ప్రజ్ఞశ్రీ 977, బైపీసీలో కె.యజ్ఞశ్రీ 973, సీఈసీలో జి.జ్ఞానేశవరి 928, ఎంఈసీలో ఎ.శృతి 795 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీన్ అభినందించారు.

సిరికొండ: ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్లో మొదటి సంవత్సరం ఫలితాల్లో 94 శాతంమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 93శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సత్తాచాటిన ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు

ఇందల్వాయి: ఇంటర్ ఫలితాల్లో ఇందల్వాయి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటినట్లు ప్రిన్సిపల్ బి.శ్రీలత తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 73 శాతం, ద్వితీయ సంవత్సరంలో 74శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో డి.మౌనిక 459 మార్కులు, రెండవ సంవత్సరంలో బి.పద్మ, బి.అనూష అత్యధికంగా 962 మార్కులు సాధించారని, బైపీసీలో అత్యధిక ఆర్.పవిత్ర 952 మార్కులు సాధించినట్లు తెలిపారు.

కోటగిరిలో..

కోటగిరి: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనారిటీ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కబనర్చారు. మైనారిటీ కళాశాలలో 50మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. షేక్.సుబాన్ బైపీసీలో (956/1000) మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచాడు. హరిన్ కుమార్ (949/1000) మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. వివేక్ రెడ్డి ఎంపీసీ విభాగంలో (940/1000) మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 195మంది విద్యార్థులకుగాను 87మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కళాశాల టాపర్‌గా ఎన్.కీర్తి బైపీసీలో (927/1000), హుజేఫా హుస్సేన్ (914/1000)మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కొత్తపల్లికి చెందిన సావిత్రి 420 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది.

ఇంటర్ ఫలితల్లో జక్రాన్‌పల్లి ఆదర్శ కళాశాల విద్యార్థుల ప్రతిభ

జక్రాన్‌పల్లి: ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాల్లో జక్రాన్‌పల్లి ఆదర్శ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో అక్షయ 449, నేహ 447, వైష్ణవి 445, గంగోత్రి 440, రాఘవీ 437మారుకలు సాధించారు. బైపీసీలో అను 434, రోషిత, తేజస్విని 417, సాయి లక్ష్మీ 398, సీఈసీలో బి.పల్లవి 392, వెన్నెల 375, మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. సెకండ్ ఇయర్‌లో ఎంపీసీలో భానుమతి 938, మనోజ్ఞ 934, బైపీసీలో ఇంద్రజ 893, వెన్నెల 890, సీఈసీలో శ్రావణి 923, సంకీర్తన 870మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 38శాతం, సెకండ్ ఇయర్‌లో 59శాతం విద్యార్థులు ఫలితాలు సాధించారని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల హవా

మెండోర: ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పోచంపాడ్ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు హవా కొనసాగించారని ప్రిన్సిపాల్ తారాసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో వర్షిత్ 978, బైపీసీలో గణేష్ 889మార్కులు సాధించగా, మొదటి సంవత్సరం ఎంపీసీలో సాయి కుమార్ 465, బైపీసీలో అమర్‌సింగ్ 432 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 75శాతం, సెకండ్ ఇయర్‌లో 93.3శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందనలు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

● పాల్గొన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవీపేట, ఏప్రిల్ 24: మండలంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత మూడురోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా చివరిరోజైన బుధవారం యజ్ఞం, పూర్ణాహుతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఉత్సవాలకు పలు గ్రామల నుంచి ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లింగమయ్య గుట్ట శివాలయం ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్, శ్రీనివాస్ గౌడ్, కోటిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శాఖవార్ రమేష్, దేవేందర్, మూర రెడ్డి, రాజరెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

● సౌకర్యాలు కల్పించాలని వినతి

మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో పలు సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరారు. ఆలయ ప్రాంగణంలో బోరుమోటారుతో పాటు నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అలాగే ఆలయానికి వెళ్లేదారిలో సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

● ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి: మాజీ మేయర్ సంజయ్



మాట్లాడుతున్న సంజయ్

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్24: గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంతా అవినీతి పాలన సాగిందని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప జరిగిన అభివృద్ధి శూన్యమని నగర మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వల్లే ప్రజాసంక్షేమం సాధ్యమని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా ఉన్న సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. భగవంతుడు పేరు చెప్పి బీజేపీ రాజకీయాలు చేస్తోందని అన్నారు. పసుపుబోర్డు పేరు తో గెలిచి ఇప్పటికీ పసుపుబోర్డుపైనే ఓట్లు అడుగుతున్న అర్వింద్‌కు ఎందుకు ఓటు వేయాలో జవాబు చెప్పాలన్నారు. పాత కలెక్టరేట్‌ను, కలెక్టరేట్ మైదానాన్ని కబ్జాచేయాలని బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని, నగరం లో బడా రాంమందిర్, నీలకంఠేశ్వర్ ఆలయాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని అన్నారు. వీటిపై బీజేపీ నేతలు విచారణ జరిపించాలన్నారు.

బీజేపీలో చేరిన పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కోటపాటికి కండువా వేసి ఆహ్వానిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్24: పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహంనాయుడు బుధవారం బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ సమక్షం లో కోటపాటి నర్సింహంనాయుడు బీజేపీలో చేరగా బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవతో పసుపుబోర్డు మంజూరైందని, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాచేసి తాను బీజేపీలో చేరినట్లు తెలిపారు. తమతోపాటు గల్ఫ్‌కార్మికులు, రైతు నాయకులు బీజేపీలో చేరారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపేలక్ష్యంగా పని చేస్తామని, నరేంద్రమోదీని ప్రధానిగా మూడోసారి చూడాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, ఇందల్వాయి కిషన్, నవీన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి'

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్24: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓబీసీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందం దివాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన పార్లమెంట్‌స్థాయి ఓబీసీమోర్చా సామాజిక సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు యామాద్రిబాస్కర్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ఎడపల్లి, ఏప్రిల్ 24: మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన చాకలి భూమవ్వ (65) గ్రామంలోని చెరువులో దూకి బుధవారం ఆత్మహత్య చేసుకుంది. భూమవ్వ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోందని, ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుమారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా అస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్నిలో కుస్తీపోటీలు

వర్ని,ఏప్రిల్24: హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా పాత వర్నిలో బుధవారం కుస్తీపోటీలు, జాతర కోలాహలంగా జరిగాయి. ఆఖరు కుస్తీలో భాగంగా సుద్దులంకు చెందిన కుస్తీ వీరున్ని పాత వర్నికి చెందిన పెద్ద పుల్ల శ్రీనివాస్ పడేశాడు. దీంతో జంగం రాచప్పకు 10తులాల వెండి కడియాన్ని అందజేశారు. ఆఖరుకుస్తీకి గ్రామ కమిటీ రూ.వెయ్యి అదనంగా అందజేశారు. కార్యక్రమంలో సబ్సిడీ నర్సింలు, అర్జున్, పెరిక సాయిలు, నారాగౌడ్, సురేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



కడియాన్ని బహూకరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మత విద్వేశాలను రెచ్చగొట్టడమే బీజేపీ పని

- రైతు వ్యతిరేక ఎన్‌డీఏ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్24: మత విద్వేశాలను రెచ్చగొట్టి అమాయక ప్రజల జీవితాలతో ఆడుకుంటూ రాజకీయ లబ్ధిపొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని, దేశంలో ఎక్కడచూసిన మతవిద్వేశాలు రెచ్చగొట్టి బీజేపీ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితుల పక్షాన ఉంటుందని అన్నారు. కానీ కొందరు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను దళితుల పార్టీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రైతులకు గిట్టుబాటుధర ఇవ్వాలని ఢిల్లీలో ధర్నా చేసిన రైతులపై లాఠీచార్జి చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. రాబోయే ఎన్నికల్లో మతతత్వ బీజేపీకి ఓటర్లు బుద్ధిచెప్పి ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. మొదట ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, మాజీవిప్ అనిల్, మాజీ ఎమ్మెల్సీ ఆకులలలితతో కలిసి నామినేషన్ వేసినజీవన్‌రెడ్డి సెకెండ్ సెట్‌ను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, సీనియర్ నాయకుడు గడుగుగంగాధర్, నగర అధ్యక్షుడు కేశవేణులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.

'నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలి'

పెద్దబజార్, ఏప్రిల్24: ఈపీఎఫ్ పెన్షనర్లకు కోర్టు తీర్పు ప్రకారం కనీస పెన్షన్, నూతనపెన్షన్‌ను ఎవరైతే రద్దు చేస్తారో వారికే పెన్షనర్ల మద్దతు ఉంటుందని తెలంగాణా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే.రామ్మోహన్‌రావ్ తెలిపారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో పెన్షనర్స్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు సిర్ప హన్మాండ్లు, ఈవీఎల్ నారయణ, రాధకృష్ణ, లక్ష్మినారయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో కుస్తీపోటీలు

మోపాల్, ఏప్రిల్ 24 :మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి నగదుతో పాటు వెండికడియంను అందచేశారు. ప్రతీ ఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా సూదులమ్మ, చిలుకల చిన్నమ్మ ఆలయం వద్ద రథోత్సవం, జాతర నిర్వహించారు. బుధవారం కుస్తీపోటీలను చేపట్టారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మండల కుస్తీ క్రీడాకారులే కాకుండా మహారాష్ట్ర నుంచి యువకులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గెలుపొందిన వారికి గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు ముప్పాగంగారెడ్డి, సాయిలు, వీడీసీ పెద్దలు బహుమతులు అందించారు. ఈ కుస్తీపోటీలను తిలకించేందుకు మండలంలో చుట్టు పక్కల గ్రామాల యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సూదులమ్మ, చిలకల చిన్నమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కుస్తీపడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన ఎస్ఆర్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎస్ఆర్ యాజమాన్యం



ఎస్ఎస్ఆర్ విద్యార్థులను అభినందిస్తున్న మారయ్యగౌడ్

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్24: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. బుధవారం విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎస్ఆర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి మరోసారి సత్తాచాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో భైరి శ్రీనిధి 468/ 470, ఎ.శ్రీనిత్య 467, జి.శ్రీచరణ్ 467, ఎం.వైష్ణవి 467, శ్రీరిత్విక్ 467 ఇలా తొమ్మిది మంది 467 మార్కులు సాధించారు. 18 మంది 466 మార్కులు, 12మంది 465 మార్కులు, 40మంది 460కి పైగా మార్కులను సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో రాథోడ్ స్నేహ 438/440, టి.ఫాతిమా 436, ఎం.నిత్యశ్రీ 436, దుర్గ 436, వైష్ణవి 436 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కె.సౌమ్య 990 మార్కులు సాధించడంతోపాటు 43 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీఎం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణప్రాంత విద్యార్థులకు అత్యుత్తమ ఫలితాలు వచ్చేలా అకాడమిక్ క్యాలెండర్‌ను రూపొందించి సీనియర్ అధ్యాపకులచే విద్యాబోధన, వీక్లీ టెస్టులు నిర్వహించడంతోనే ఈస్థాయి మార్కులు వచ్చాయని తెలిపారు. జోనల్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్ మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎస్ఆర్ కళాశాలలను ఆదరిస్తున్న తల్లిదండ్రులకు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ హన్మంత్‌రావు, అగేందర్‌రెడ్డి, సత్యం, శ్రీధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ ప్రదీప్‌రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు. జేఈఈ మేయిన్స్ ఫలితాల్లోను ఎస్ఆర్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన వెక్టర్ విద్యార్థులు

నగరంలోని వినాయక్‌నగర్‌లోగల వెక్టర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకు లు సాధించారు. ఇంటర్‌ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కళాశాల వి ద్యార్థులు సత్తాచాటారు. ఎంపీ సీ ప్రథమ సంవత్సరం ఫలితా ల్లో కళాశాలకు చెందిన ప్రద్యు మ్న 466/470, వెన్నెల 466, సంస్కృతి 466, నిశాంత్‌రెడ్డి 466, స్నిగ్ధ 466, బైపీసీలో వర్షిని 437/440, శారద 435, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సాయిదుర్గ 980/ 1000, చరణ్ ఆదిత్య 979, ద్వితీయ స ంవత్సరం బైపీసీలో డి.సౌమ్య 975/1000, ఎస్‌వీ వై ష్ణవి 975 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ మధుసూధన్‌జోషి, డైరెక్టర్లు గజానన్, సంతోష్, కార్తీక్ విద్యార్థులను అభినందించారు. ఇటీవల విడుదలైనజేఈఈ మేయిన్స్ ఫలితాలలోనూ విద్యార్థులు ఉత్తమర్యాంకులు సాధించినట్లు తెలిపారు.



వర్షిని (వెక్టర్ కళాశాల)

నారాయణ విజయభేరి



కీర్తనను అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

నగరంలోని వినాయక్‌నగర్‌లో గల నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో విజయభేరి మోగించారు. కళాశాలకు చెందిన నారా మాధవి నాగశ్రావ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 467/470, లవంగ వైష్ణవి 466, పంచచాలకర్ రియా 466, తాడూరి శ్రీరామ ప్రియ 465, బండి ప్రాగ్వి 465, అంబటి శ్రావణి 462 మార్కులు సాధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో శివరాశి కీర్తన 991/1000, మర్రి హర్ష 987, మలిమాటి ఇషా 986, లిఖిత్ 985 మార్కులు సాధించారు. బైపీసీలో మొదటి సంవత్సరం ఫలితాలలో దివ్యశ్రీ 424 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ సెషన్ 1 ఫలితాలలోనూ నారాయణ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల స్థాపించిన రెండో సంవత్సరంలోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఏవో శేఖర్, ప్రసాద్, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలలో ఎస్ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

నగరంలోని ఖలీల్‌వాడిలోగల ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఉత్తమప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన విద్యార్థులు హర్షిత ఎంపీసీలో 918, వామన్ 869, మదన్ 868, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీలో నవీన్ 391, అక్షయ్ 379, వైశాలి 369, వొకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యు (ఎఫ్) గ్రూప్‌లో అనిత 408, మేహుక్ 398 మార్కులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ హరితగౌడ్, ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

నగరంలో చైన్‌స్నాచింగ్

- మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

ఖిల్లా, ఏప్రిల్ 24: నగరంలోని నాల్గో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల వినాయక్‌నగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలో బుధవారం సాయంత్రం మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన చోటుచేసుకుంది. హనుమాన్ మందిరం వద్ద నివాసం ఉంటున్న లక్కవత్రి నాగమణి బయటకు వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు అఘంతకులు మహిళ మెడలో నుంచి సుమారు 2న్నర తులాల బంగారు గొలుసును అపహరించారు. ఆమె అప్రమత్తమై కేకలు వేయగా కుటుంబ సభ్యులు బయటకు వచ్చిన ఫలితం లేకుండా పోయింది. అఘంతకులు బైక్‌పై తప్పించుకుని పరారయ్యారు. సమాచారం అందుకున్న నగర సీఐ నరహరి నాల్గోవ టౌన్ ఎస్సై సంజీవ్ ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను తనిఖీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

- పేకాటరాయుళ్ల అరెస్ట్.. రూ.58వేలు స్వాధీనం

నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.58 వేల 430 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్ తెలిపారు. కచ్చితమైన సమాచారం మేరకు నాందేవ్‌వాడలో పేకాట ఆడుతున్న సమాచారంపై దాడి చేయగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను గుర్తించామని, వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆర్మూర్‌టౌన్ ఏప్రిల్24: పట్టణంలోని రాంనగర్ సీఆర్‌సీ భవనంలో స్వీప్ నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం టీఎల్ఎఫ్ సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఐ ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా మహిళలందరు కుటుంబసభ్యులు ఓటు వేయడమే గాకుండా చుట్టు పక్కల ఉన్న కాలనీవాసులను ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు ఆయన అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో ఓటింగ్ శాతంను మెరుగ్గా అయ్యేలా చూడాలని, ఏలాంటి ప్రలోభాలకు లోంగకుండా ఓటు వేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, టీఎంసీ ఉదయశ్రీ, సీసీ రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం'

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 24: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం వేల్పూర్ మండలం మోతె గ్రామంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటి పథకాలను అమలు చేస్తున్నామని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అంతా అవినీతి జరిగిందని, ప్రజలను దోపిడీ చేశారని వారు విమర్శించారు. కాం గ్రెస్ పార్టీకి ఓటు వేసి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని అన్వేష్‌రెడ్డి కోరారు.

ప్రజలు భక్తిమార్గంలో నడవాలి: ఎమ్మెల్యే పోచారం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, పలువురు నాయకులు

వర్ని, ఏప్రిల్ 24: ప్రజలు భక్తిమార్గంలో నడవాలని బాన్సువాడల ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలం జలాల్‌పూర్ గ్రామంలో బుధవారం శ్రీ కోదండ రాముడి విగ్రహాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రతిష్టించారు. సుమారు 2కోట్ల విరాళాలతో గ్రామ ప్రజలు శ్రీరామమందిరాన్ని నిర్మించారు. మల్లారం పీఠాధిపతి శ్రీపిట్ల కృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, స్వామివారికి ప్రాణ ప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, అభిషేకం, అలంకరణ, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీచైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగంపల్లి గంగారాం, సీహెచ్ గంగారాం, వెంకట్ గౌడ్, సురేందర్, బాలు, శంకర్, సాయిలు పాల్గొన్నారు. బీజేపీ మాజీఎమ్మెల్యే యెండల లక్ష్మి నారాయణ ప్రత్యేక పూజలు చేశారు.

ఇంటర్ ఫలితాల్లో ఉషోదయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

బోధన్‌రూరల్, ఏప్రిల్24: ఇంటర్ ఫలితాల్లో బోధన్ పట్టణంలోని ఉషోదయ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో కదం అంకిత (993/1000)మార్కులు సాధించి ప్రతిభను కనబర్చింది. ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని శ్వేత (987/1000) మార్కులు, బైపీసీ సెకండ్‌ఇయర్‌లో పూజ (990/1000), ఖురతు న్‌ఏన్ (989/1000) మార్కులు సాధించారు. సీఈసీ సెకండ్‌ఇయర్‌లో రుమేసియా (969/1000) మార్కులు సాధించింది. అలాగే ఎంపీసీ మొదటి సంవత్సరంలో పూజిత (467/470) మార్కులు సాధించి తమ ప్రతిభను కనబర్చింది. ఎండీ.మహ్మద్ సోమద్దీన్ (466/470) మార్కులు, అంషు, ముజామిల్, సాయిచరణ్ (465/470) మార్కులు, బైపీసీ మొదటి సంవత్సరంలో తబసుమ్ (436/440) మార్కులు, సీఈసీ మొదటి సంవత్సరంలో అమీనాబేగం (491/500) మార్కులు సాధించారని కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దృశ్యాంత్ విద్యార్థులను అభినందించారు.



కె.పూజ (బైపీసీ)

క్రీడాకారులకు వాలిబాల్స్ వితరణ

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్24: ఆర్మూర్ మండలం మగ్గిడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం క్రీడా జ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో వాలీబాల్‌ను వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహకాన్ని అందించాలని ఫౌండేషన్‌వారు వాలీబాల్స్‌ను అందజేసినట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమ్మర్‌పల్లి తహసీల్దార్ అంజనేయులు

ప్రతీఒక్కరు బాధ్యతగా ఓటు వేయాలి

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 24: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలోని ప్రతీ ఓటరు బాధ్యతగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ అంజనేయులు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల మహిళాసంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 911 మహిళా సంఘాలలో 9400మంది సభ్యులు ఉన్నారని, ప్రతీ సభ్యురాలు తమ బంధువులు, సన్నిహితులు, ఇరుగు పొరుగు వారు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా మహిళా సంఘాలు ఐకేపీ సిబ్బంది తమవంతు కృషిచేయాలని అన్నారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన ఓటుహక్కు అవగాహన కర్యాక్రమంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్ మాట్లాడుతు గ్రామ స్థాయి అధికారులు, మహిళ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ప్రతీ పోలింగ్‌బూత్‌లో వందశాతం పోలింగ్ యనమోదు అయ్యేలచూడాలని, గ్రామాలలో ఆవగాహన కల్పిస్తు ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించాని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్, ఏపీఎం కుంట గంగారెడ్డి, మండంలోని పంచాయితీ కార్యదర్శులు, కారోబార్లు, పంచాయితీ రాజ్, వ్యవసాయశాఖ సిబ్బంది, ఐకేపీ సీసీలు నవీన్, రవి, వీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.



సుర్బిర్యాల్‌లో పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న వాజిద్‌హుస్సైన్

పంట కోత ప్రయోగాల పరిశీలన

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్24: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో పంట కోత ప్రయోగాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ పరిశీలించారు. పంట కోత ప్రయోగంలో భాగంగా పంట దిగుబడిని అంచన వేయడానికి ఈ ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు విజయలక్ష్మీ, ఏఈవో నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

సిరికొండ, ఏప్రిల్ 24: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్కోల్ గ్రామానికి చెందిన గుర్రాల రవీందర్‌కు 15 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని సదరు మహిళ తన అన్నదమ్ముళ్లకు చెప్పగా వారు రవీందర్‌ను చితకబాదినట్లు గ్రామసులు చెప్తున్నారు. ఈ విషాయాన్ని రవీందర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి చెప్పగా పోలీసుల స్పందించకపోవడంతో మనస్థాపానికి గురై సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నడని గ్రామసులు చెప్తున్నారు. సూసైడ్‌నోట్‌లో సదరు మహిళ పేరుతోపాటు మరో ఆరుగురి వల్ల తాను చనిపోతున్నట్లు రాసినట్లు ఉందని ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన పూర్తి వివరాలను సీఐ భిక్షపతి, ఏఎస్సై బాల్‌సింగ్ తెలుపలేదు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,600	రూ.68,800	రూ.860

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (1.10, 7.25)
: టిల్లు స్క్వేర్ (4.30, 10.25)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.40)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ)(7.15)
స్క్రీన్-3 : తెప్ప సముద్రం (1.40)
: పారిజాత పర్వం (4.35)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (7.30)
: మార్కెట్ మహాలక్ష్మి (10.35)
స్క్రీన్-4 : హ్యాపిడేస్ (1.30)
: లవ్‌యూ శంకర్ (తెలుగు) (4.50)
: టెనెంట్ (7.30)
: మైదాన్ (హిందీ) (9.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (1.45, 7.30)
: మంజుమ్మల్ బాయ్స్ (4.35, 10.30)
స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (11.00, 1.40)
: ఫ్యామిలీ స్టార్ (4.25, 10.30)
: హ్యాపిడేస్ (7.35)
స్క్రీన్-3 : హ్యాపిడేస్ (10.40, 4.30, 10.30)
: మంజుమ్మల్ బాయ్స్ (7.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : హ్యాపిడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్